క్లుప్తంగా

14న మెగా రక్తదాన, వైద్య శిబిరం

దేవరాపల్లి: మండలంలోని కాశీపురంలో ప్రముఖ న్యూరో ఫిజీషియన్ బొడ్డు దేముడు బాబు సారథ్యంలో స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 మెగా రక్తదాన, వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 6 గంటల నుంచి నిర్వహించే శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు కోరారు. రక్తదానం చేసే వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

అంతర పంటల సాగుపై రైతుల ఆసక్తి


కె.సంతపాలెంలో మామిడిలో అంతర పంటగా వేసిన బరబాటి

కె.కోటపాడు : అంతర పంటల సాగుపై పలు గ్రామాల రైతులు ఆసక్తి చూపుతున్నారు. మండలంలో మెట్ట ప్రాంతాల్లో గల రైతులు ఎక్కువగా మామిడి తోటలను సాగు చేస్తారు. మామిడి పంటల కాపు ఏప్రిల్ నుంచి ప్రారంభం కానుంది. ఈ తోటల మధ్యలో గల ఖాళీ ప్రదేశాల్లో కూరగాయాల పంటలను సాగుచేస్తున్నారు. 45 రోజులకే దిగుబడి ప్రారంభమయ్యే కాయగూరల సాగు ద్వారా అదనపు ఆదాయం లభిస్తున్నట్టు రైతులు తెలిపారు. మండలంలో పాతవలస, పిండ్రంగి, మర్రివలస, గొట్లాం, బొట్టవానిపాలెం, సూదివలస, కె.కె.అగ్రహారం గ్రామాల్లో గల రైతులు మామిడి పంటలో అంతర పంటగా బరబాటి, బెండ, వంగ, టమాటా పంటలను సాగు చేస్తున్నారు.

తాగునీటి బోరు ఏర్పాటు


బోరును ఏర్పాటు చేస్తున్న దృశ్యం

గొలుగొండ: చోద్యం కనకదుర్గ ఆలయం వద్ద తాగునీటిని బోరును ఏర్పాటు చేసినట్టు వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి తెలిపారు. ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన ఈ బోరును వల్ల కనక దుర్గ ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు, సమీప ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని బాబ్జి చెప్పారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన ఎంపీపీ గజ్జలపు మణికుమారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బొందల రాజు, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తిబాబు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ


యాచకులకు దుప్పట్లు అందజేస్తున్న సీఐ గోవిందరావు, అప్పలనాయుడు

నర్సీపట్నం: స్థానిక వేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ యూనిట్ మేనేజర్ సూరెడ్డి అప్పలనాయుడు ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. పట్టణ సీఐ జి.గోవిందరావు చేతుల మీదగా స్వామి వారి ఆలయం వద్ద ఉన్న యాచకులకు దుప్పట్లు అందజేశారు.

మోదమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న గ్రామస్తులు

మాడుగు రూరల్ : మండలంలోని ఎం.కోడూరు మోదకొండమ్మ ఆలయ ప్రహరీ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ గొళ్ళ విల్లి సంజీవరావు మాట్లాడారు, ఎంపీటీసీ ముమ్మిన రమణబాబు కోటా నిధులు రూ.2 లక్షలతో గోడ నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సాలూరు బాబా కృపానిధి, భారతీ దేవి దంపతులతో పాటు, ఆలయ పూజారి శ్రీనివాస శర్మ తదితరులు పాల్గొన్నారు.


తీర్థంలో ప్రత్యేక ఆకర్షణ రంగులరాట్నాలు


పండగ కళ తెచ్చే రంగుల బెలూన్లు


నోరూరించే పంచదార చిలుకలు

పల్లె సంస్కృతికి ప్రతీక... సంబరాల పతాక

- సంక్రాంతి తీర్థాలకు ముస్తాబవుతున్న గ్రామాలు
- ఆటవిడుపుగా జరిగే తీర్థాలతో సందడేసందడి
- 13 నుంచి గ్రామీణ జిల్లాలో ప్రారంభం
- జిల్లాలో మొదటి తీర్థం భోగి రోజున చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద..


చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి..

చోడవరం : సంవత్సరమంతా ఎండనక, వాననక కాయకష్టం చేసి అలసిపోయే గ్రామీణ ప్రజలకు సంక్రాంతి పండగతో ఆరంభమయ్యే తీర్థమహోత్సవాలు ఎంతో ఆటవిడుపును కల్గిస్తాయి. పట్టణ ప్రాంత వాసులకు పార్కులు, బీచ్‌లు, ఇతర వినోద విహార ప్రాంతాలు అందుబాటులో ఉంటాయి. పల్లెల్లో ఇటువంటి విహార కేంద్రాలు ఉండవు. కనుక ఏడాదికి ఒక సారి వచ్చే సంక్రాంతి తీర్థాలంటే గ్రామీణ ప్రజలకు ఎంతో ఇష్టం. తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకే కాకుండా సమీప గ్రామాల్లో నిర్వహించే తీర్థాలకు కాలినడకన వెళ్లి మరీ చూసి సంబరపడతారు. ఆలయాలు, గ్రామదేవతల గుడుల వద్ద, పెద్దలుగా పూజించే దివంగత తల్లిదండ్రులు, తాతమామ్మలు, జాతీయ నాయకులు, అభిమాన నేతల విగ్రహాల వద్ద ఈ తీర్థాలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా భోగి పండగ నుంచి గ్రామాల్లో తీర్థాలు ప్రారంభమవుతాయి. చోడవరంలోని స్వయంభూ విఘ్నేశ్వరుని ఆలయం వద్ద జరిగే తీర్థం నుంచి చోడవరం,మాడుగుల పరిసరాలతోపాటు జిల్లా అంతటా ఈ సంబరాలు మొదలవుతాయి. కాణిపాకం వినాయకుని తర్వాత అంతటి సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా బాసిల్లుతున్న చోడవరం శ్రీ స్వయంభూ విఘ్నేశ్వరుడి ఆలయం వద్ద ఈ ఏడాది భోగి రోజు సోమవారం మొదటి తీర్థాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. సుమారు 50రోజులకు పైబడి రోజుకి రెండు,మూడు గ్రామాల్లో అన్ని చోట్ల తీర్థాలు నిర్వహిస్తారు. చోడవరం, వడ్డాది, రావికమతం, కొత్తకోట, రోలుగుంట, మాడుగుల, దేవరాపల్లి, కె.కోటపాడు, చౌడువాడ, కశింకోట,యలమంచిలి, నక్కపల్లి, రాంబిల్లి, నర్సీపట్నం, పాయకరావుపేట, అచ్యుతాపురం, తుమ్మపాల, సబ్బవరంతోపాటు ఇతర పెద్ద గ్రామాల్లో ప్రముఖ దేవాలయాల వద్ద, తోడపెద్దులను కొలిచే చోట, దివంగతులైన కొందరు గ్రామపెద్దలను స్మరించేచోట తీర్థాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ తీర్థాల్లో అనేక ప్రత్యేకతలు కనువిందుచేస్తాయి. గిర్రున తిప్పే రంగులరాట్నాలు, నోరూరించే పంచదార చిలుకలు, గ్రామీణులకే అందుబాటులో ఉండే నెయ్యిచెక్కీలు, కర్జూరం దుకాణాలతో పాటు పండగ వాతావరణాన్ని తీసుకువచ్చే రంగురంగుల బెలూన్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆయా గ్రామాల్లో నిర్వహించే ఎడ్ల బళ్లు, గుర్రం పందాల పోటీలు చిన్నాపెద్దా అందరికీ హుషారు కల్గిస్తాయి. ఈ తీర్థమహోత్సవాలకు పిల్లలను తీసుకువెళ్లి వారికి బెలూన్లు, రకరకాల బొమ్మలు, తినుబండారాలను కొనిస్తారు. ఇలా కొనివ్వడం ప్రతి ఒక్కరికీ తమ బాల్యాన్ని గుర్తుకు తెస్తుంది. బంధుమిత్రులను ఆహ్వానించి విందు వినోదాలతో అతిథి మర్యాదలు చేయడంతో గ్రామమంతా సందడి నెలకొంటుంది. మందుబాబుల విందులు తోడవ్వడంతో తీర్థాల్లో ఉండే హడావుడి అంతా ఇంతా కాదు. బతుకుతెరువుకోసం, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన వారు కూడా తమతమ గ్రామాల్లో జరిగే తీర్థాలకు విధిగా హాజరై ఎంతో ఆనందంతో గడుపుతారు. ప్రపంచం సాంకేతికంగా ఎంత అభివృద్ధి చెందుతున్నా తెలుగువారు గ్రామీణ సంస్కృతిని విడవకుండా పూర్వీకుల సంప్రదాయాలను ఈ తీర్థాల ద్వారా కొనసాగిస్తున్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి శోభ


వడ్డాదిలో విద్యార్థినుల నృత్యం


మాడుగుల శ్రీవిజ్ఞాన్ హైస్కూల్‌లో భోగి మంట వేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


నేతవానిపాలెంలో హరిదాసు వేషధారణలో విద్యార్థి


హరిదాసు, జంగమయ్య తదితర వేషధారణలలో మాడుగుల శ్రీవిజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు


చోడవరం డిగ్రీ కళాశాలలో ముగ్గు వేస్తున్న విద్యార్థినులు


లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో భోగిమంట

బుచ్చెయ్యపేట: మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సంక్రాంతి సంబరాలను వేడుకగా నిర్వహించారు. భోగి మంటలు, గొబ్బిళ్లు, ముత్యాల ముగ్గులు, సంప్రదాయ దుస్తులతో ముందస్తుగా సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పాల్గొన్నారు. బాలికలు వేసిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. మేజర్ పంచాయతీ వడ్డాది నేషనల్ టాలెంట్ స్కూల్,నేతవానిపాలెం ప్రాథమిక పాఠశాల తదితర పాఠశాలల్లో విద్యార్థులు హరిదాసు,రైతన్న వేషధారణలతో ఉత్సవాల్లో పాల్గొన్నారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముగ్గుల మధ్య గొబ్బెమ్మలు పెట్టి సంక్రాంతి ఆటపాటలతో హుషారుగా గడిపారు. ఉపాధ్యాయులు,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక శ్రీవిజ్ఞాన్ హైస్కూల్‌లో ముందస్తుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సంబరాలు ప్రిన్సిపాల్ పైల కొండలరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చోడవరం రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది సందడిగా ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ మూడు యూనిట్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సంబరాల్లో సంప్రదాయ వస్త్రధారణతో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. భోగి మంటను వెలిగించారు. ప్రిన్సిపాల్ పి.కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి.సత్యవతి ఎన్ఎస్ఎస్ పీవోలు డి.మాల్యాద్రి, బి.పిచ్చమ్మ, రత్నభారతి, సీనియర్ ఉపన్యాసకులు అప్పలనాయుడు, సుధీర్, రఫీయుద్దీన్, నారాయణ, మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లక్ష్మీపురం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం జగన్నాథరావు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిపారు. మాజీ సర్పంచ్ సిరిశోళ్ళ సత్యారావు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు భోగిమంట వేశారు.

ఉత్తరద్వార దర్శనం.. పులకించిన భక్తజనం

ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు


గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు


చోడవరం ఆపదశ్రీనివాసస్వామి క్షేత్రంలో...


సత్యవరంలో సీతారాముల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు


సమ్మెద రామాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఎంపీపీ రాజారామ్‌ను సత్కరిస్తున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులు


గిడుతూరులో సామూహిక వ్రతాల్లో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామి వారు


మాడుగుల పార్థసారథి స్వామి ఆలయంలో..


రోలుగుంటలో వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు


చెర్లోపాలెంలో నగర సంకీర్తన


మాడుగుల వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

చోడవరం : ఉత్తర ద్వారం నుంచి శ్రీహరిని కనులారా వీక్షించిన భక్తులు పులకించిపోయారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముక్కోటి ఏకాదశి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవాడ వేంకటేశ్వరస్వామి, చోడవరం ఆపద హరశ్రీనివాస క్షేత్రం (వేంకటేశ్వరస్వామి), కేశవస్వామి ఆలయాల్లో భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. వేలాది మంది దర్శనానికి రావడంతో ఆలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుగర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వి.వి.సన్యాసినాయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఎండీ పీఏ రవి, ఆలయ పర్యవేక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు. చోడవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ప్రదర్శించిన తిరుమల తిరుపతి దేవస్థానం దాససాహిత్య మహిళల బృందం కోలాటకం అందర్నీ ఆకట్టుకుంది. ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సత్యనారాయణమూర్తి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. కేశవస్వామి దేవాలయంలో మహాభారతం, భాగవతాల్లో ఘట్టాలను వివరిస్తూ ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామాచార్యులు ప్రవచించారు.

కె.కోటపాడు : మండలంలోని పలు గ్రామాల్లోని వైష్ణవ ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడిచర్లలో భూదేవి, శ్రీదేవి సమేత కేశవస్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు.

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులలో పార్థసారథ, వేంకటేశ్వర, సీతారామ స్వామి ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పార్థసారథి స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనంపై ఊరేగించారు. సీతారామ స్వామి ఆలయంలో, వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సుమారు 5 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. సత్యవరం గ్రామంలో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

మాడుగుల రూరల్: కస్పా జగన్నాథపురం కల్యాణ వేంకటేశ్వ స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.రామ కొండలరావు ఇతర పాలక వర్గ సభ్యులు పాల్గొన్నారు. స్వామి వారిని ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారామ్ దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎంపీపీని ఘనంగా సత్కరించారు.

రోలుగుంట : స్థానిక కొండపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలను ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్తరద్వారం ద్వారా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అంతకు ముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ ప్రసాద వితరణ చేశారు.

మాకవరపాలెం: వైకుంఠ ఏకాదశిని మండలంలో ఘనంగా నిర్వహించారు. తామరం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నారాయణరాజుపేటలో భక్తులు మేలుకొలుపు జరిపారు. గిడుతూరు రామాలయంలో సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహించారు.

నాతవరం: మండలంలోని పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. మర్రిపాలెం, మాధవనగరం, వెదురుపల్లి, ఎం.బి.పట్నం గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. చెర్లోపాలెంలో మేలుకొలుపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సీతారాములు ఫొటోలను పల్లకీలో ఉంచి, సంకీర్తనలు పాడుతూ ఊరేగించారు.

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా ముక్కోటి ఏకాదశి పూజలు శుక్రవారం ఘనంగా జరిగాయి. మారేపల్లిలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం,దేవరాపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం, చింతలపూడి పంచాయతీ సమ్మెద రామాలయంలలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి.

నర్సీపట్నం: స్థానిక వెంకటేశ్వరస్వామి, బలిఘట్టం ఉత్తరవాహినిలోని సత్యనారాయణస్వామి ఆలయాల్లో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి విశేష అలంకరణతో శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శేషవాహనంపై పట్టణ పురవీధుల్లో ఊరేగించారు.

తారువలో ముగిసిన భజన కార్యక్రమం


పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: మండలంలోని తారువ రామాలయం ఆవరణలో 24 గంటల పాటు నిర్వహించిన భజన కార్యక్రమం శుక్రవారం రాత్రి 8 గంటలతో ముగిసింది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని గ్రామస్తులు గురువారం రాత్రి 8 గంటలకు హరే రామ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే నామ స్మరణం చేస్తూ భజన కార్యక్రమాన్ని ప్రారంభించి శుక్రవారం రాత్రి 8 గంటలకు ముగించారు. గ్రామస్తులతో కలిసి భజన చేసిన మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, రమణమ్మ దంపతులు, ముగింపు కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూజలు చేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గొంప వరహాలమ్మ, ఉప సర్పంచ్ బూడి సూర్యనారాయణ, మర్లమాంబ భజన బృందం గురువు సబ్బవరపు సత్యం, వాయిద్య గురువు కశింకోట సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జెడ్పీ సీఈవో నారాయణమూర్తి


జెడ్పీ సీఈవో నారాయణమూర్తికి తాగునీటి సమస్యను వివరిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట : మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఎంపీడీవో వి.ఎస్.నాగేశ్వరరావుతో కలసి రోలుగుంట, జానకీరామపురంలలో నీటి పథకాలను పరిశీలించారు. తాగునీటి సమస్యపై వస్తున్న ఫిర్యాదుల గురించి ఏఈ రాజును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసరావు తాగునీటి సమస్య ఉన్న గ్రామాల గురించి, ప్రజలనుంచి వస్తున్న ఫిర్యాదులను వివరించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి వాటిని పరిష్కరించాలని, వచ్చిన ఫిర్యాదులు మళ్లీ వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని సీఈవో హెచ్చరించారు.

వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

మాకవరపాలెం: వైద్య సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలని డీఎంహెచ్‌వో రవికుమార్ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. వ్యాక్సిన్ రూమ్‌తోపాటు ల్యాబ్‌ను పరిశీలించారు. ఓపీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి వేళల్లో సకాలంలో వైద్య సేవలు అందడం లేదని ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు శ్రీవిద్య, సీతారామలక్ష్మి, సీహెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.

దేవతా చెట్టుకు పూజలు


దేవతా చెట్టు వద్ద పూజలు ప్రారంభించిన ఎంపీపీ రాజారామ్, మాజీ ఎంపీపీ పెదబాబు, కోఆప్షన్ మెంబరు ఉన్నీషా తదితరులు

మాడుగుల: స్థానిక పురాతన దేవతా చెట్టు వద్ద చేపట్టిన అభివృద్ధి పనుల అనంతరం ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం పూజలు ప్రారంభించారు. మండల పరిషత్ నిధులతో కోఆప్షన్ మెంబర్ ఉన్నీషా దేవతా చెట్టు చుట్టూ స్టీల్ గ్రిల్, డోర్‌లను ఏర్పాటు చేశారు. పనులు పూర్తికావడంతో పూజలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉన్నీషా, ఎంపీపీ తాళ్ళపురెడ్డి వెంకటరాజారామ్, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, సర్పంచ్ ఎడ్ల కళావతి, వైఎస్సార్ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు,మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు బసవా రామపరమేష్, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు పొలిమేర విజయలక్ష్మి, కుక్కర మహేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కర శ్రీధర్, ఎడ్ల హేమంత్ కుమార్, పెరుమళ్ళ వెంకటరావు, మురళి, సయ్యపురెడ్డి సత్తిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం


అంట్లపాలెంలో పశువుల షెడ్‌లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట : మండలంలో చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్. రాజు శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అంట్లపాలెంలో పశువుల షెడ్‌లు, అర్ల నుంచి పీతురుగెడ్డ వరకు మంజూరైన రూ.1.9 కోట్ల విలువైన రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు.